భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి డిమాండ్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 9 : రైతాంగ సమస్యల పరిష్కారానికి పాలక ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం(ఏఐపీకేఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ రైతుల పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించాలని, నూతన వ్యవసాయ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రైతుల రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సుమారు 16 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా పూర్తిస్థాయిలో అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎలాంటి ఆంక్షలు, కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, నాయకులు అమర్ల పూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, కల్లూరి కిశోర్, మాచర్ల సత్యం, ఈసం శంకర్, బుర్ర వెంకన్న, నూప భాస్కర్, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పహారా మరింత పెంచుతున్నాం

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు సహకరించాలి
- పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి: సీపీ

ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జనవరి 9: సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో పోలీసు పహారా మరింతగా పెంచుతున్నట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. పండుగ సందర్భంగా ఊరు ప్రయాణాలు చేసే వారు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనికి అనుగుణంగా ప్రజలు కూడా పోలీసులకు సహకారించాలని కోరారు. ఊర్లకు వెళ్లే ప్రజలు తమ ఇంట్లో ఉన్న నగదు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లడం గానీ, లేదా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవడం గానీ చేయాలని సూచించారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలూ చేపట్టామని, రాత్రి వేళల్లో వీధుల్లో పెట్రోలింగ్, బీట్ గస్తీ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాము చేసే కొన్ని ముఖ్యమైన సూచనలను ప్రజలు విధిగా పాటించాలని కోరారు. ఇంటికి తాళం వేసిన తరువాత అది బయటకు కనిపించకుండా గుమ్మానికి పరదా కప్పి ఉంచాలన్నారు. మెయిన్ డోర్‌ను లోపలి నుంచి లాక్ చేసి పక్క డోర్లకు కూడా తాళాలు వేయాలని సూచించారు. బీరువాల తాళాలు ఇంట్లో కప్ బోర్డుల్లో గానీ లేదా ఇతర ప్రదేశాల్లో గానీ ఉంచకూడదని సూచించారు. ఊరు వెళ్తున్న విషయాన్ని నమ్మకస్తులైన పొరుగిళ్ల వారికి, సంబంధిత పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి వచ్చినప్పుడు ఆయా ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే, అనుమానిత వ్యకులు లేదా కొత్త వ్యక్తులు ఆయా ఇళ్ల చుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. మొబైల్ ఫోన్‌కు నోటిఫికేషన్ వచ్చేలా ఇంటికి సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్‌ను కూడా ఫోన్‌లో సేవ్ చేసుకోవాలన్నారు. సమాచారం కావాలంటూ ఇంట్లోని మహిళలు, వృద్ధుల వద్దకు వచ్చే అపరిచితులను నమ్మవద్దని సూచించారు. ఇలాంటి సూచనలు పాటిస్తూ ప్రజలకు సహకరించాలని కోరారు.

పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

చుంచుపల్లి, జనవరి 9 : సామాన్యులకు న్యాయాన్ని చేరువ చేయడంలో పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. భద్రాద్రి జిల్లా కోర్టు ఆవరణలో పారా లీగల్ వలంటీర్ల రెండు రోజుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి భానుమతి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న వృద్ధాశ్రమాలు, మానసిక వికాస కేంద్రాలను వలంటీర్లు సందర్శించి వారి సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. ఏదైనా న్యాయ సంబంధ అంశం ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కొత్తగూడెం వారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, పి.నిరంజన్ రావు, జి.రామచంద్రరెడ్డి, రమేశ్, జి.నాగస్రవంతి, జ్యోతి విశ్వకర్మ, వరప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ప్రిన్సిపాల్

- జీతాల బిల్లు కోసం రూ.2 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అటెండర్‌పై కేసు నమోదు

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అటెండర్

ఇల్లెందు, జనవరి 9: ఓ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి నుంచి లంచం తీసుకుంటూ ప్రిన్సిపాల్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మైనార్టీ గురుకుల పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆగస్టు నుంచి కాంట్రాక్టు తెలుగు టీచర్‌గా సంధ్యారాణి పనిచేస్తున్నది. ఆమెకు సంబంధించి నాలుగు జీతాల బిల్లు చేయడానికి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ రూ.10 వేలు డిమాండ్ చేశాడు. దీంతో మొదటగా రూ.2 వేలు ఇస్తానని ఒప్పుకున్న సంధ్యారాణి తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. వారు పన్నిన పథకం ప్రకారం గురువారం ఉదయం ప్రిన్సిపాల్ కృష్ణకు ఉపాధ్యాయురాలు రూ.2 వేలు లంచం ఇవ్వగా.. ఆ డబ్బులు అటెండర్ రామకృష్ణకు ఇవ్వాలని సూచించాడు. దీంతో అప్పటికే అక్కడ మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రిన్సిపాల్ కృష్ణ, అటెండర్ రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

పింఛన్ల పెంపు.. పచ్చిమోసం!

- ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో పేదలను వంచించే హామీలను ప్రకటించింది కాంగ్రెస్ పార్టీ. ఆసరా పింఛన్‌దారుల ఓట్లను కొల్లగొట్టేందుకు పచ్చి మోసపూరిత హామీలను ఇచ్చి.. గద్దెనెక్కినంక రిక్తహస్తం చూపించింది. ఎన్నికల సమయంలో ఆసరా పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బోదకాలు, హెచ్ఐవీ, డయాలసిస్ రోగులకు రూ.4,000 పింఛన్లు, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్లు అందిస్తామని కపట నాటకం ఆడింది. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 13 నెలలు ముగిసినప్పటికీ పింఛన్ల పెంపు ఊసే ఎత్తడం లేదు. ఇక కొత్తగా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారి పరిస్థితి ఎడారి కథే అవుతున్నది.

- మామిళ్లగూడెం, జనవరి 9

పండుటాకులకు రిక్తహస్తం

- ఏడాది దాటినా 'ఆసరా' ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం
- మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన వైనం
- తలలు పట్టుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక రోగులు
- కొత్త పింఛన్ల కోసం 14,652 మంది ఎదురుచూపులు

ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పేదల అభివృద్ధికి పెద్దపీట వేశారు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లు పాలకులుగా ఉన్న కాంగ్రెస్, టీడీపీలు పేదలను పట్టించుకున్న పాపానపోలేదు. బీఆర్ఎస్ పార్టీ వారిని అక్కున చేర్చుకుని 'ఆసరా'గా నిలిచింది. నాడు రాజకీయ అండదండలు, ముడుపులు చెల్లించిన వారికే పింఛన్ అన్నవిధంగా పేదల పట్ల కాంగ్రెస్, టీడీపీలు వ్యవహరించాయి. కొత్త రాష్ట్రంలో నిరుపేదల పింఛన్ కష్టాలను తీర్చాలన్న తలంపుతో నాటి సీఎం కేసీఆర్ ఆసరా పథకానికి రూపకల్పన చేశారు. అంగవైకల్యం ఉన్నవారికి సంఘ సేవకుడిగా.. వృద్ధులకు బాధ్యత గల పెద్దకొడుకుగా.. వితంతువులు, ఒంటరి మహిళలకు ఓదార్పునిచ్చే అన్నగా.. చేనేత, గీత కార్మికుల కష్టాలు తెలిసిన కార్మికుడిగా.. బోదకాలు, ఎయిడ్స్ రోగులకు చేయూతనిచ్చే స్నేహితుడిగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసరా పథకాన్ని 2014 అక్టోబర్ నుంచి అమలు చేశారు. నిరుపేదల సంక్షేమం, సాంఘిక భద్రత కల్పించడంలో గత ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవ్వగా.. వారికి కొండంత అండగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వం. నాడు కాంగ్రెస్ అందించిన రూ.200 పింఛన్ కనీసం మందుబిల్లలకు కూడా సరిపోయేదికాదు. పెరుగుతున్న ధరలు, క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితులను అధ్యయనం చేసిన నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం నెలరోజులపాటు ఒక్క పూటన్న కడుపు నిండా భోజనం చేయాలన్న దృక్పథంతో రూ.200, రూ.500 ఉన్న పింఛన్లను ఏకంగా రూ.2,000, రూ.4,000 వరకు పెంచారు.

బీఆర్ఎస్ హయాంలో..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్లు అందించింది. ఎప్పటికప్పుడు అర్హులను గుర్తించి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిడి, అశ్రద్ధ లేకుండా అవినీతిరహితంగా నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకున్నారు. నేటికీ బీఆర్ఎస్ సర్కార్ మంజూరు చేసిన పింఛన్లే కొనసాగుతున్నాయి.

కనికరం లేని కాంగ్రెస్ ప్రభుత్వం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 13 నెలలు పూర్తి చేసుకున్నప్పటికీ నేటికి ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదు. అధికారం చేపట్టిన వెంటనే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించి వాటిని మూటకట్టి అటకెక్కించారు. అయినా ప్రజలు ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండలస్థాయిలో జరిగే ప్రజావాణిలో పింఛన్ల కోసం దరఖాస్తులు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు కొత్త పింఛన్ల కోసం 14,652 మంది ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా కనికరం లేని కాంగ్రెస్ సర్కార్ వాటి ఊసే ఎత్తడం లేదు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఎలా ఉండేదో నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పరిస్థితీ అలాగే కనిపిస్తున్నది.

ప్రస్తుతం కొనసాగుతున్న పింఛన్ల వివరాలు..

పింఛన్ రకం	లబ్ధిదారులు	అందుతున్న సొమ్ము
వృద్ధాప్య (రూ.2,016)	71,955	రూ. 145,061,280
చేనేత కార్మికులు (రూ.2,016)	439	రూ. 8,85,024
గీత కార్మికులు (రూ.2,016)	3,196	రూ. 6,443,136
వితంతువులు (రూ.2,016)	71,251	రూ. 143,642,016
ఎయిడ్స్ బాధితులు (రూ.2,016)	2,572	రూ. 5,185,152
ఒంటరి మహిళలు (రూ.2,016)	8,499	రూ. 17,133,984
వికలాంగులు (రూ.4,016)	28,275	రూ. 113,552,400
బోదకాలు పింఛన్లు (రూ.2,016)	1,416	రూ. 2,854,656
డయాలసిస్ (రూ.2,016)	134	రూ. 270,144
బీడీ కార్మికులు (రూ.2,016)	02	రూ. 4,032
మొత్తం	1,87,737	రూ.43,50,27,792

దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి..

జిల్లాలో ప్రతి నెలా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీలో కమిషనర్లు ఆయా దరఖాస్తులను పరిశీలించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లాగిన్‌లో పంపుతారు. కలెక్టర్ అనుమతితో అక్కడి నుంచి తుది ఎంపిక కోసం రాష్ట్ర అధికారులకు పంపించడం జరుగుతుంది. అక్కడ ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలు పరిశీలించి రెండు నెలల్లో అర్హుల జాబితాను జిల్లా కార్యాలయం ద్వారా స్థానిక అధికారులకు పంపిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న అర్హుల్లో మరణించిన, ఇక్కడి నుంచి వలస వెళ్లిన, వేర్వేరు కారణాలతో అందుబాటులో లేనివారి వివరాలను గుర్తించి వాటిని తొలగించి కొత్తవారికి మంజూరు చేస్తున్నాం.

– రాజేశ్, డీపీఎం, పెన్షన్స్ విభాగం

ఖమ్మంలో నకిలీ వైద్యులు!

- అర్హత లేకపోయినా విచ్చలవిడిగా క్లినిక్‌ల ఏర్పాటు
- వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం
- ఆకస్మిక తనిఖీలతో జిల్లా వైద్యారోగ్య శాఖ కొరడా
- కఠిన చర్యలకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సిఫార్సు

నకిలీ క్లినిక్‌లోని మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యశాఖ అధికారులు

ఖమ్మంలోని నకిలీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం సిటీ, జనవరి 9 : ప్రజల అమాయకత్వం.. అవగాహన లేమి.. వెరసి నకిలీ వైద్యుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఆక్యూ పంచుర్, కేరళ, హెర్బల్, ఆయుర్వేదం వంటి పేర్లతో జనాల జేబులు లూటీ చేస్తున్నారు. ఏమాత్రం అర్హత లేకపోయినా, అడుగడుగునా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. డాక్టర్లుగా చెలామణి అవుతూ మోసాలకు పాల్పడుతున్నారు. వచ్చీరాని వైద్య సేవలతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. ఈ తతంగం అంతా ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరుగుతున్నదని కాదు. సాక్షాత్తూ జిల్లా కేంద్రమైన ఖమ్మం నడిబొడ్డులో నిత్యం జరుగుతున్న దందా. ఎంబీబీఎస్ నుంచి మొదలుపెడితే స్పెషలిస్ట్ వైద్యుల వరకూ వీరందరికీ సమాంతరంగా నకిలీల రాజ్యం కొనసాగుతుండడం గమనార్హం. వీరిపై గతంలో అనేక ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ ప్రాంతాలు మారుస్తూ, బోర్డులు తిప్పేస్తూ యథేచ్ఛగా తప్పుడు వైద్యాన్ని అందిస్తున్నారు. నగరంలోని అరవై డివిజన్ల పరిధిలో ఈ తరహా క్లినిక్‌లు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు తనిఖీలకు సమాయత్తమవుతున్నారంటే చాలు.. క్షణాల్లో వీరికి సమాచారం చేరిపోతుండడం విశేషం.

తనిఖీల్లో విస్తుపోయే అంశాలు..

ఖమ్మం ట్రంక్ రోడ్డు ప్రాంతంలో వై.నరేశ్‌కుమార్ అనే వ్యక్తి ఆక్యూ పంచుర్ క్లినిక్ పేరుతో ఒక దవాఖాన తెరిచాడు. దానికి రిజిస్ట్రేషన్ లేదు. పైగా తన పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకున్నాడు. జనానికి వైద్య సేవలు అందిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి తన యంత్రాంగంతో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలకు వెళ్లారు. స్థానికంగా దర్శనమిచ్చిన అంశాలను గమనించిన ఆమె అవాక్కయ్యారు. న్యూరో ఫిజీషియన్ లేదా సర్జన్‌ను తలపించే రీతిలో నరాలు నొక్కి చికిత్స చేస్తానని, కాళ్లు, కీళ్లు, ఎముకల నొప్పులు తగ్గిస్తానని రోగులకు చెబుతూ తన వద్దకు రప్పించుకున్నాడు. ఇటీవలే కామేపల్లి మండలం పాత లింగాల గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాస్ (53) అనే వ్యక్తి సదరు నకిలీ వైద్యుడి నిర్వాకానికి మృత్యువాత పడ్డట్లుగా తెలుసుకున్న డీఎంహెచ్‌వో.. ఈ నకిలీ వైద్యుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో పుట్టి తెలంగాణలోని పలు జిల్లాల్లో రోగులను మోసం చేసినట్లుగా నిర్ధారణ కావడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా కోరారు. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేయించారు. అదేవిధంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో కేరళ వైద్యం పేరుతో వెలిసిన మరో క్లినిక్‌ను తనిఖీ చేసి మూసివేయించారు.

నకిలీ క్లినిక్‌లపై ప్రత్యేక దృష్టి : డీఎంహెచ్‌వో

జిల్లాలో కొందరు నకిలీ వైద్యులు.. ఆక్యూ పంచుర్, కేరళ వైద్యం, హెర్బల్, హోమియోపతి క్లినిక్‌లను ఏర్పాటు చేసుకుని తప్పుడు పద్ధతుల్లో వైద్యసేవలను కొనసాగిస్తున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి అన్నారు. తనిఖీల సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు, అర్హతలు లేకుండా వెలుస్తున్న నకిలీ క్లినిక్‌లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వైద్యం పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా సార్వజనీన ఆసుపత్రి(పెద్దాసుపత్రి)లోని ఎన్‌సీడీ క్లినిక్‌ను సందర్శించి అసంక్రమణ వ్యాధుల చికిత్స గురించి అటు వైద్యులను, ఇటు రోగులను అడిగి తెలుసుకున్నారు. మందులు, స్టోర్, ల్యాబ్‌ను పరిశీలించారు. కేటాయించిన స్టాఫ్ నర్సులు అక్కడే పనిచేసే విధంగా చూడాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సూచించారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ రామారావు, డెమో సాంబశివారెడ్డి, ఎన్‌హెచ్ఎం డీపీవో దుర్గ, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నా 'ఇందిరమ్మ ఇంటి' బిల్లును స్వాహా చేశారు..

- 2012లో నాకు తెలియకుండానే మరొకరు కాజేశారు
- దీంతో ఇప్పుడు నాకు ఇల్లు మంజూరు కావడం లేదు
- సెల్ టవర్ ఎక్కి పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్యాయత్నం

సెల్‌టవర్ వద్ద గుమిగూడిన గ్రామస్తులను పంపిస్తున్న పోలీసు, చిత్రంలో శ్రీను (ఫైల్)

మధిర (చింతకాని), జనవరి 9: గతంలో తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి బిల్లు స్వాహా చేసిన వారిపై చర్య తీసుకోవాలని, ఇప్పుడు తనకు ఇల్లు మంజూరు చేయాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చింతకాని మండలం నాగిలిగొండలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికుడు పామర్తి శ్రీను భార్య లక్ష్మీ తిరుపతమ్మ పేరుపై ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2012లో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. కానీ, దీనికి సంబంధించిన బిల్లును మరొకరు కాజేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, రూ.5 లక్షల బిల్లు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలో పామర్తి శ్రీను, అతడి భార్య లక్ష్మీ తిరుపతమ్మ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుదారులను యాప్ ద్వారా ఫొటో తీసి అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే శ్రీను భార్య లక్ష్మీ తిరుపతమ్మ పేరుపై ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు, బిల్లులు కూడా చెల్లించినట్లు అధికారుల సర్వేలో తేలింది. దీంతో శ్రీను.. ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్సైని ఆశ్రయించాడు. దీనిపై వారెవరూ స్పందించకపోవడంతో గ్రామంలోని రామాలయం సమీపంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనకు న్యాయం జరిగేంత వరకు దిగేది లేదని భీష్మించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగుల్‌మీరా తన సిబ్బందితో అక్కడికి చేరుకుని శ్రీనును టవర్ దిగి కిందకు రావాలని కోరారు. ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని తహసీల్దార్ అనంతరాజు, ఎస్సై నాగుల్‌మీరా తెలపడంతో శ్రీను కిందకు దిగి వచ్చాడు.